క్లుప్తంగా

బ్యాంక్ ఆఫ్ బరోడా స్వచ్ఛత ర్యాలీ

హన్మకొండ చౌరస్తా: స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. వేయిస్తంభాల గుడి నుంచి హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ వరకు సాగిన ర్యాలీలో డీఆర్ఎం తెలంగాణ నార్త్ రీజియన్ గిరిధర్, సీనియర్ మేనేజర్ కిరణ్‌కుమార్, విజయ్, నవీన్, తిరుపతి, కిరణ్మయి, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

కాజీపేట రూరల్: కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీ.రాజు సమతలను బుధవారం డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. రాజు తండ్రి ఎంపీ.ప్రసాద్‌రావు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు రాజేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అంకూస్, మేకల ఉపేందర్, గుంటి స్వప్న, బుర్ర బాబురావు, మేరీ, డివిజన్ అధ్యక్షుడు షేక్‌అజగర్, కొండ శివయాదవ్, మహమ్మద్ రహమతుల్లా పాల్గొన్నారు.

వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై వాకర్స్ శ్రమదానం



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో ఉన్న వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ రిజర్వాయర్‌పై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రమదానం చేశారు. వాకర్స్ ఇంటర్‌నేషనల్ 303 సభ్యుడు కోండ్రు నర్సింహారావు ఆధ్వర్యంలో వాకర్స్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. తహసీల్దార్ జి.రవీందర్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సారయ్య, రవీందర్ రెడ్డి, ఎండి అలీ, కైలాస్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

హసన్‌పర్తి: ఉపాధ్యాయుల బదిలీల్లో దివ్యాంగ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్‌రెడ్డి కోరారు. హసన్‌పర్తి మండలం భీమారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు వృత్తిరీత్యా ఎక్కువ శాతం ఒకేచోట స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారని, స్థానచలనం కల్పిస్తే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందోందన్నారు. సమావేశంలో దివ్యాంగ ఉపాధ్యాయులు ప్రభాకర్, సుధాకర్, సృజన, ప్రాణహిత తదితరులు పాల్గొన్నారు.

'చలో కొండగట్టు' పోస్టర్ ఆవిష్కరణ

నయీంనగర్ : ఈ నెల 24న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కొండగట్టుకు రానున్న నేపథ్యంలో యాత్ర పోస్టర్‌ను పార్టీ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు బైరి వంశీకృష్ణ బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండగట్టు అంజన్నను దర్శించుకుని ఆలయ సన్నిధిలో వారాహి వాహనానికి పవన్‌కళ్యాణ్ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెల్తూరి నగేష్, తాళ్లపెల్లి క్రాంతికుమార్, జన్ను ప్రవీణ్, సందీప్, సాయికిరణ్, రమేష్, అరుణ్, సాయికృష్ణలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



హన్మకొండ అర్బన్: రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకొని నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రెడ్‌క్రాస్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఆర్‌టీఓ వేణు, రాజనాల శ్రీహరి, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు హాజరై శ్రీనివాస్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం టీఎన్జీవోస్ భవన్‌లో శ్రీనివాస్‌రావుతో టీఎన్జీవోస్ నాయకులు కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కాళీప్రసాద్, జిల్లా పాలకవర్గ సభ్యులు పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, పాపిరెడ్డి, జన్ను హాస్పిటల్ ఎండీ చరంజిత్‌రెడ్డి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు శేషుమాధవ్, సుదీప్, బాలాజీ, టీజీఓ నేతలు మురళీధర్ రెడ్డి, కిషన్, సురేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్, వరంగల్ రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు శాంతికుమార్, కల్లపెల్లి సురేష్, రాజ్‌కుమార్, సుదర్శన్ పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్, చిరు దుకాణాలతో హనుమకొండ చౌరస్తాలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహ స్థలం





కూ'డల్'!

- అస్తవ్యస్తంగా హనుమకొండ చౌరస్తా
- కలగానే మిగిలిన ఉద్యానవనం
- ఆరేళ్లయినా ముందుకుసాగని పనులు
- దుర్గంధభరితంగా చంద్రబోస్ విగ్రహ పరిసరాలు
- పట్టించుకోని పాలకులు

హన్మకొండ చౌరస్తా: నిత్యం రద్దీగా ఉండే హనుమకొండ చౌరస్తా అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో కళావిహీనంగా తయారైంది. నగరంలోని ప్రధాన జంక్షన్లను అందంగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు చౌరస్తా అభివృద్ధిని విస్మరిస్తున్నారు. నిత్యం ఇక్కడి నుంచే జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తుంటారు. అయినప్పటికీ కనీసం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మూలన పడ్డ ప్రణాళిక!

హనుమకొండ చౌరస్తాను అందంగా తీర్చిదిద్దుతామని అప్పటి నగర మేయర్, ప్రస్తుత వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మున్సిపల్, 'కుడా' ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చౌరస్తాను పరిశీలించారు. ఆతర్వాత ప్రణాళిక తయారు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. చౌరస్తా వేదికగా రూపొందించిన మ్యాప్‌ను పరిశీలించి కేవలం ఆర్నెళ్లలో చౌరస్తాను అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆతర్వాత మేయర్ ఎమ్మెల్యే అయ్యాడు. ఆతర్వాత వచ్చిన పాలకవర్గం మ్యాప్‌ను మూలన పడేసింది. సుమారు ఆరేళ్లు గడుస్తున్నా.. అడుగు ముందుకు పడలేదు.

విగ్రహ చరిత్రకు చెదలు

1954 హైదరాబాద్ రాష్ట్రంలో అప్పటి కౌన్సిలర్ నగర వీధికి చెందిన తైలం యాదగిరి తన సొంత ఖర్చులతో హనుమకొండ చౌరస్తాలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో నేతాజీ విగ్రహాన్ని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి దేవీసింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అప్పటి నుంచి చంద్రబోస్ జయంతిని ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. హైదరాబాద్ సంస్థానంలో ఏర్పాటైన ఈవిగ్రహం చుట్టూ నాలుగు దశాబ్దాల క్రితం హనుమకొండ చౌరస్తాలో పార్కు ఏర్పాటు చేశారు. చౌరస్తాకు గుండెకాయలాంటి పార్కులో చాలా మంది సేద తీరేవారు. ఆరేళ్ల క్రితం పార్కును మరింత అభివృద్ధి చేస్తామని చెప్పిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పాలకవర్గం ఉన్నది కూల్చేసి చేతులు దులుపుకున్నారు. కొద్ది రోజుల పాటు సుభాష్ చంద్రబోస్ విగ్రహం నిరాధరణకు గురవగా.. స్థానికుల చొరవతో మళ్లీ గద్దెకట్టి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహం



బాస్ మన్నించు!

పార్కు ఉన్న స్థలాన్ని పూర్తిగా చదును చేసి వదిలేయడంతో ఆస్థలంలో షాపింగ్‌కు వచ్చే వాళ్లు తమ కార్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రెండేళ్లుగా చిరువ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో సుభాష్ చంద్రబోస్ విగ్రహ పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయి. చదును చేసిన స్థలంలో చిరు దుకాణాలు, వాహనాల్ని పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాత్రయిందంటే చాలు చిరు దుకాణాల మాటున మూత్ర విసర్జన చేస్తున్నారు. దుకాణదారులు వ్యర్థాలు, చెత్త వేస్తున్నారు. దీంతో ఆప్రాంతమంతా కంపుకొడుతోంది. వరంగల్ నుంచి కాజీపేటకు వెళ్లా వాహనాలు, వివిధ అవసరాల కోసం వచ్చే జనంతో రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలో పార్కింగ్ చేయడంతో పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణ తలనొప్పిగా మారింది.

బాధేస్తోంది!



మా నాన్న తైలం యాదగిరి 1954లో చంద్రబోస్ విగ్రహాన్ని స్థాపించారు. అప్పట్నుంచి ఇప్పటివరకు బోస్ విగ్రహాన్ని చౌరస్తాలోని మూడు చోట్లకు మార్చారు. ఇప్పుడున్నది నాలుగో చోటు. అభివృద్ధి పేరుతో మార్చిన ప్రతిసారీ తిరిగి ప్రతిష్ఠించాలని వేడుకోవడం, మమ అనిపించేలా తిరిగి ప్రతిష్ఠించడం అధికారులకు అలవాటైంది. ప్రస్తుతం విగ్రహ పరిసరాలు దుర్గంధ భరితంగా కంపుకొడుతుండడం చూస్తుంటే బాధేస్తోంది.

- తైలం వేణుగోపాల్, విగ్రహ ప్రతిష్ఠ చేసిన తైలం యాదగిరి కుమారుడు

కమీషన్లపై ఉన్న శ్రద్ధ.. అభివృద్ధిపై లేదు!



ప్రస్తుత ప్రజాప్రతినిధులకు కాంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్లపై ఉన్న శ్రద్ధ, అభివృద్ధిపై లేదు. ఆరేళ్ల క్రితం హనుమకొండ చౌరస్తాను సుందరీకరణ చేస్తామని ఉన్న పార్కును చదును చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడం వారి మొద్దు నిద్రకు నిదర్శనం. జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు చౌరస్తా కనిపించకపోవడం బాధాకరం.

- చీకటి రాజు, స్థానికుడు

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

మామునూరు: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజవర్గ ఇన్‌చార్జ్ నామిండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ బుధవారం వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చింత ప్రకాశ్, మన్నెబాబురావు, శివరామకృష్ణ ఆధ్వర్యంలో గుడిసెవాసుల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజయ్య, శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ గుడిసెవాసులంతా తమ ఐక్యతను చాటుతూ ముందుకు వెళ్తే స్థలాలు సొంతమవుతాయని తెలిపారు. 43, 44 డివిజన్ల పరిధిలోని గుడిసెవాసులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో వడ్డెపల్లి ప్రకాశ్, పసునూరి అనిల్, కాగిత రాజు, గడ్డం రఘు, పొగాకు నరేష్, కిట్టు, నాయకులు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రూ.3లక్షలతో అయ్యప్పస్వామి రథం

ఖిలా వరంగల్: రూ.3లక్షల వ్యయంతో అయ్యప్పస్వామికి ప్రత్యేక రథం చేయించి భక్తులకు అందజేస్తానని సామాజిక వేత్త, అయ్యప్ప గురుస్వామి బత్తిని సతీష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వరంగల్ శివనగర్‌కు చెందిన రథ నిర్మాణ శిల్పి శంకరాచారిని కలిసి రథ నిర్మాణానికి అడ్వాన్స్‌గా రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి అంటే తనకు ఎనలేని భక్తి అని చెప్పారు.

మార్కెట్‌లో మిర్చి ధరలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వండర్ హాట్ మిర్చి క్వింటా ధర రూ.35వేలు పలికిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. యూఎస్-341 రకం రూ.22వేలు, తేజ రూ.20వేలు, తాలు మిర్చి క్వింటా ధర రూ.8వేలు పలికిందని, 5,927 బస్తాల మిర్చి విక్రయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే పత్తి క్వింటా ధర రూ.7,860 పలికిందని, 1,718 బస్తాలు అమ్మకానికి వచ్చినట్లు తెలిపారు.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుడి మృతి

క్రైం కార్నర్

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కాజీపేట మండలం మడికొండ ప్రాంతానికి చెందిన వాసుదేవ్(40) చికిత్స కోసం తన సోదరుడితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి రైళ్లో సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో జనగామ దాటాక వాసుదేవ్ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. దీంతో రైలు కాజీపేటకు రాగానే పోలీసులు మృతదేహాన్ని కిందికి దింపారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

కాశిబుగ్గ: బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన కాశిబుగ్గలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపాడ్‌కు చెందిన మాదాసి కట్టయ్య నగరంలోని ఓ హాస్పిటల్‌కు వచ్చి వైద్యం చేయించుకొని ఇంటికి వెళ్తున్నాడు. కాశిబుగ్గ సిద్ధయ్య హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బాలాజీనగర్‌కు చెందిన వాహనదారుడు బైక్‌తో కట్టయ్యను ఢీకొట్టాడు. దాంతో అతడి కాలు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా కట్టయ్యను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.



వృద్ధుడికి ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

ఏడుగురిపై చీటింగ్ కేసు

కాజీపేట: నంబర్ ప్లేట్లు లేకుండా రాకపోకలు సాగిస్తున్న ఏడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు కాజీపేటలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పలువురు నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేసి, మరికొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా తిరుగుతుంటే పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎన్.దేవచారి, మురావత్ సంజు, బండారి ప్రవీణ్, బైరగాని మల్లేశం, ఎండి ఫరీద్ ఖాన్, గంటి అర్జున్, కోడెటి క్రామిక్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అతిథులు

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురంలో సీనియర్ సిటీజన్స్ విద్యారణ్యపురి, లయన్స్‌క్లబ్ ఆఫ్ గోపాలపురం ఆధ్వర్యంలో వృద్ధుకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటీజన్స్, లయన్స్‌క్లబ్‌లు చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుధాకర్, అడ్వైజర్ వేణుగోపాల్, సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండి రహీం ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి బర్ల యాకుబ్, బైరి శేషాద్రి, కొంగర ప్రభాకర్, మహేందర్, సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వరంగల్: తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన గొప్ప నాయకుడు మాజీ సీఎం ఎన్టీ రామారావు అని టీడీపీ 14వ డివిజన్ అధ్యక్షుడు పాశికంటి రమేష్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్.నర్సింగరావు, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తహసీల్దార్‌కు 'డబుల్' లబ్ధిదారుల వినతి

వరంగల్: 14వ డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు బుధవారం వరంగల్ తహసీల్దార్ సత్యపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్ఆర్‌నగర్‌లో 208 మందికి డబుల్ ఇళ్లు ఇచ్చిందని తెలిపారు. అందులో 26మంది తమ మొత్తం స్థలాన్ని అప్పగించగా, కొందరు 60 గజాలు మాత్రమే అప్పగించాలని పేర్కొన్నారు. అందువల్ల మిగిలిన స్థలంలో తాము ఇళ్లు నిర్మించుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో కాలనీలోని సీపీఐ, బీజేపీ నాయకులు రాకేష్, చందు, కృష్ణ, రాజు, దామెర కృష్ణలతో పాటు కొంతమంది మాపై దాడులు చేసి అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేశారని తెలిపారు. మిగిలిన స్థలాన్ని తమ పేరుపై చేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతిరి రాజశేఖర్, పుట్టా రాజేందర్, ముడుస్సు నర్సింహ, పసులాది మల్లయ్య, ముచ్చర్ల స్టాలిన్, కేతిరి సమ్మక్క, సరిత, రాజేశ్వరి, రజిత, యాసిన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఖిలా వరంగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, కార్పొరేటర్ గుండు చందన సూచించారు. వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని అధికారులతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్ఓ బుధవారం పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ 100రోజుల పాటు నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి, డాక్టర్ వాసవి, ముజామిల్, మెప్మా సీఓ ప్రవీణ్, సుజాత, కల్పనాదేవి, అనూష, ఆర్పీలు మాడిశెట్టి కవిత, బక్కి రమాదేవి, పోతు రమాదేవి, శేర్ల అమరావతి, శంకేశి రాధిక, చిట్ల రమ్య, చిట్ల సంధ్యారాణి, అడుప కవిత, కత్తెరపల్లి నీరజ, ఆశావర్కర్లు, బజ్జూరి లావణ్య, కేడల రమ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎస్సీ వర్గీకరణపై ఒత్తిడి తీసుకురావాలి

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయమై బీజేపీ అధిష్టానంపై ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్‌మాదిగ, హనుమకొండ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నెరవేర్చకుండా జాప్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేలా పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారిని కోరారు. 12శాతం పైగా ఉన్న మాదిగల మద్దతు లేకుండా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పగటి కలని, మాదిగలకే న్యాయం చేయలేని పార్టీ తెలంగాణ ప్రజలకు ఏం న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శాంతిసాగర్ మాదిగ, కొట్టే కళ్యాణ్ మాదిగ, వస్కుల ప్రణయ్ మాదిగ, ఇనుముల రాజు కుమార్ మాదిగ , మచ్చ వశిష్ఠ మాదిగ, చిలుక రాజు మాదిగ పాల్గొన్నారు.



రావు పద్మ, కొండేటి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హోరాహోరీగా రైల్వే క్రికెట్ టోర్నమెంట్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం రెండో రోజు హోరాహోరీగా జరిగింది. కాజీపేట రైల్వే ఏరియా ఆఫీసర్ విజయ్‌కుమార్, రైల్వేస్టేషన్ మేనేజర్ బాలరాజు టాస్ వేసి ఫ్రెండ్స్ 11 - ఇంజనీరింగ్ సౌత్ జట్ల మధ్య మొదటి మ్యాచ్‌ను ప్రారంభించించారు. అలాగే, కాజీపేట రైల్వే ఆస్పత్రి డీఎంఓ డాక్టర్ హరిబాబు లెవెన్ బుల్లెట్స్ - లోకో 11 డ్రైవర్ల జట్ల మధ్య రెండో మ్యాచ్‌ను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో ఫ్రెండ్స్ 11 జట్టు, రెండో మ్యాచ్‌లో లెవెన్ బుల్లెట్స్ జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, సభ్యులు ప్రశాంత్, ప్రవీణ్, రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ ట్రెజరర్ వేదప్రకాష్, చింత తిరుపతి, ఇంద అనిల్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

ఖమ్మం తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



బీఆర్ఎస్ శ్రేణులతో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



జెండా ఊపుతున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

హన్మకొండ: ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్న బహిరంగ సభకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా వెళ్లారు. వాహన శ్రేణిని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌బాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హసన్‌పర్తి నుంచి..

హసన్‌పర్తి: ఖమ్మంలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ సభకు హసన్‌పర్తి మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, నరేడ్ల శ్రీధర్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్, ఆత్మ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

19, 20వ డివిజన్ నుంచి..

కాశిబుగ్గ: ఖమ్మంలో బుధవారం నిర్వహించిన భారత రాష్ట్ర సమితి బహిరంగ సభకు 19, 20 డివిజన్ల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లాయి. వాహనాలను 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యాస్వామి, ఓని భాస్కర్, సోనుబాబు, ఉమా మహేందర్, పవన్, చందర్, నాగరాజు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.17లక్షల వ్యయంతో చేపట్టిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జి.నెహ్రూ, సతీష్, ఏఈఎన్ ఉదయ్, విద్యా కమిటీ చైర్మెన్ వెంకటస్వామి, అనిత, హరి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ రవీందర్ యాదవ్

చైల్డ్‌లైన్‌పై అవగాహన

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బాలింతలు, గర్భిణులు, మహిళలు, బాలలకు చైల్డ్‌లైన్-1098 ఆధ్వర్యంలో బాలికల రక్షణ, బ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్‌లైన్ జిల్లా టీం మెంబర్ బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్ల అని తెలియగానే బ్రూణ హత్యలకు పాల్పడడం క్రూరమైన చర్య అని అన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.